సాక్షి జగిత్యాల

మంగళవారం : 9 : ఏప్రిల్ : 2024



సోమ అమావాస్య పూజలు

ధర్మపురి: ధర్మపురిలో సోమఅమావాస్య వేడుకలు నిర్వహించారు. అక్కపెల్లి రాజరాజేశ్వర, శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయాల్లోని రావిచెట్టుకు మహిళలు పూజలు చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళ(సా॥)	సహర్ బుధ(ఉ॥)
కరీంనగర్	6.29	4.33
పెద్దపల్లి	6.36	4.44
రాజన్న సిరిసిల్ల	6.36	4.42
జగిత్యాల	6.36	4.40

గరిష్టం/కనిష్టం
40.0/25.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. జిల్లావ్యాప్తంగా కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

స్టాక్ రిజిస్టర్ నిర్వహణ తప్పనిసరి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి వాణి

జగిత్యాలఅగ్రికల్చర్: ఫర్టిలైజర్ డీలర్లందరూ తప్పనిసరిగా స్టాక్ రిజిస్టర్ నిర్వహించాలని జిల్లా వ్యవసాయాధికారి వాణి అన్నారు. జగిత్యాల రూరల్ మండలం పొలాస రైతువేదికలో జగిత్యాల రూరల్, సారంగాపూర్ మండలాల ఫర్టిలైజర్ డీలర్లకు సోమవారం అవగాహన కల్పించారు. ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ లైసెన్స్ పొందిన వారు మాత్రమే రసాయన మందులు విక్రయించాలని, ఎవరైనా లైసెన్స్ లేకుండా విక్రయిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు మాత్రమే అమ్మాలని సూచించారు. ఎరువుల కొనుగోళ్లను ఎప్పటికప్పుడు ఈ-పాస్ యంత్రంలో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి తిరుపతినాయక్, ఏఈవోలు రమ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.

కుష్ఠు నివారణకు కృషి



రాయికల్‌లో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రాయికల్: కుష్ఠు వ్యాధి నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. సోమవారం రాయికల్ ప్రభుత్వ ఆస్పత్రిలో కుష్ఠువ్యాధి నిర్ధారణ శిబిరం నిర్వహించారు. 85 మంది అనుమానితులకు స్క్రీనింగ్ పరీక్ష చేశారు. వ్యాధిగ్రస్తులకు ఏడాది పాటు మందులు పంపిణీ చేస్తామన్నారు. ప్రాథమిక దశలోనే వ్యాధి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సతీశ్, డీపీఎంవో హీర్యానాయక్, సీహెచ్‌వో ప్రమీల, ఆరోగ్య పర్యవేక్షకులు శ్రీధర్ పాల్గొన్నారు.

జిల్లాకు తేలికపాటి వర్ష సూచన

జగిత్యాలఅగ్రికల్చర్: రానున్న ఐదు రోజుల్లో జిల్లాలో తేలికపాటి వర్షసూచన ఉందని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం డైరెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షంతోపాటు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. పగటి ఉష్ణోగ్రతలు 37 నుంచి 40 డిగ్రీల సెల్సియస్‌గా, రాత్రి ఉష్ణోగ్రతలు 24 నుంచి 26 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశం ఉందన్నారు. అలాగే గాలిలో తేమ ఉదయం 61 నుంచి 79 శాతం, మధ్యాహ్నం 36 నుంచి 56శాతంగా నమోదయ్యే అవకాశం ఉందన్నారు. వర్షసూచన ఉన్నందున రైతులు పంట ఉత్పత్తులపై టార్పాలిన్ కవర్లు కప్పుకోవాలని సూచించారు.

నేటి నుంచి సదరెం స్లాట్

జగిత్యాల: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఏప్రిల్, మే మాసాల్లో సదరెం క్యాంపులు నిర్వహిస్తున్నట్లు జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాములు తెలిపారు. ఏప్రిల్, మే నెలల్లో దివ్యాంగులు కొత్తవారు, పాత సర్టిఫికెట్ల రెన్యూవల్ కోసం ఈనెల 8 నుంచి స్లాట్‌బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ఈనెల 10న ఆర్థో, 18న హియరింగ్, 19, 24, 26, 30న ఆర్థో, 23న విజువల్, మే 8, 15న ఆర్థో, 17 హియరింగ్, 22, 29, 31 ఆర్థో, 24న విజువల్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో క్యాంపు ఉంటుందని తెలిపారు. ఈనెల 23న, మే 24న జరిగే విజువల్ క్యాంపులు మాతాశిశు సంక్షేమ కేంద్రంలో నిర్వహిస్తామన్నారు. దివ్యాంగులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు మీసేవ నుంచి రశీదు తీసుకుని హాజరు కావాలని సూచించారు.

రాజపూజ్యం ఎవరికో?



- నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి ఎంపీ స్థానాల్లో రసవత్తర రాజకీయం
- ప్రధాన పార్టీల్లో రాజయోగం వరించేదెవరినో?
- క్రితంసారి అనూహ్య విజయాలు నమోదు
- ఈసారి మూడు పార్టీలకు ప్రతిష్టాత్మకం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:
ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మొత్తం 13 నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో జగిత్యాల, మెట్‌పల్లి నిజామాబాద్ పరిధిలోకి, సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి, కరీంనగర్, మానకొండూరు, హుజూరాబాద్, హుస్నాబాద్ కరీంనగర్ పరిధిలోకి, పెద్దపల్లి, ధర్మపురి, రామగుండం, మంథని పెద్దపల్లి ఎంపీ సెగ్మెంట్ పరిధిలోకి వస్తాయి. మూడు స్థానాల్లోనూ అభ్యర్థులకు ఈ ఎన్నికలు చాలా కీలకం. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఎలాగైనా వీటిని కైవసం చేసుకోవాలని చూస్తున్నాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం పాలైన బీఆర్‌ఎస్ పార్టీ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రెండింటినైనా గెలిచి, తిరిగి పట్టు నిలుపుకోవాలని పావులు కదుపుతోంది. ఐదేళ్ల క్రితం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో సామాన్యులుగా రంగంలోకి దిగిన బండి సంజయ్(కరీంనగర్) సిట్టింగ్ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌ను ఓడించి, ధర్మపురి అర్వింద్(నిజామాబాద్) సిట్టింగ్ ఎంపీ కవితపై పైచేయి సాధించి, అనూహ్య విజయాలను అందుకున్నారు. ఈసారి తమ స్థానాలను నిలబెట్టుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తుండగా.. అదే స్థాయిలో కాంగ్రెస్ కూడా వ్యూహాలు రచిస్తోంది.



బండి సంజయ్ (బీజేపీ) డి.అర్వింద్ (బీజేపీ) టి. జీవన్‌రెడ్డి (కాంగ్రెస్) గడ్డం వంశీ (కాంగ్రెస్)



కొప్పుల ఈశ్వర్ (బీఆర్‌ఎస్) బి. వినోద్ (బీఆర్‌ఎస్) బి. గోవర్ధన్ (బీఆర్‌ఎస్) జి. శ్రీనివాస్ (బీజేపీ)

నినాదాలు.. మేనిఫెస్టోలు..
నిజామాబాద్, పెద్దపల్లిల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ తమ అభ్యర్థుల్ని ఇప్పటికే ప్రకటించాయి. వారు ఇప్పటికే ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. నిజామాబాద్ నుంచి బాజిరెడ్డి గోవర్ధన్(బీఆర్‌ఎస్), ధర్మపురి అర్వింద్(బీజేపీ), తాటిపర్తి జీవన్‌రెడ్డి(కాంగ్రెస్)లు పోటీ పడుతున్నారు. పెద్దపల్లి నుంచి గడ్డం వంశీ(కాంగ్రెస్), గోమాస శ్రీనివాస్ (బీజేపీ), కొప్పుల ఈశ్వర్ (బీఆర్‌ఎస్)లు బరిలో ఉన్నారు. కీలకమైన కరీంనగర్ నుంచి బండి సంజయ్(బీజేపీ), బి.వినోద్‌కుమార్(బీఆర్‌ఎస్)లు బరిలో ఉండగా.. కాంగ్రెస్ ఇంకా అభ్యర్థిని ప్రకటించలేదు. దేశభక్తి, అయోధ్య రామాలయం, ఉమ్మడి జిల్లాలో ప్రారంభించిన ప్రాజెక్టులు, హిందుత్వమే ఏజెండాగా బీజేపీ దూకుడుగా వెళ్తోంది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో తమకు అధికారం కట్టబెట్టిన 6 గ్యారంటీలనే కాంగ్రెస్ నమ్ముకుంది. దీనికితోడు కేంద్ర నాయకత్వం ప్రకటించిన 'పంచన్యాయ్', రాష్ట్రానికి ప్రత్యేకంగా ప్రకటించిన మేనిఫెస్టో తమకు మేలు చేస్తాయని భావిస్తోంది. జాతీయ పార్టీలు రాష్ట్ర అభివృద్ధిని పట్టించుకోవని, తెలంగాణ గళం పార్లమెంట్‌లో వినిపించాలంటే.. తప్పకుండా తమను గెలిపించాలని బీఆర్‌ఎస్ కోరుతోంది.

పార్లమెంట్ స్థానాల జాతక చక్రం
ఎంపీ స్థానాలు : 3
ప్రధాన పార్టీల అభ్యర్థులు : 9 మంది
రాజపూజ్యం : ముగ్గురికి
వ్యయం : రూ.కోట్లు, ఆదాయం : ఓట్లు

ఈసారి ఖర్చు రూ.కోట్లలోనే..
ఈసారి పార్లమెంట్ ఎన్నికల ఖర్చు క్రితంసారితో పోలిస్తే పెరిగేలా ఉంది. ప్రచారం, పెట్రోల్, భోజనం, సభల నిర్వహణ ఖర్చు అమాంతం పెరిగింది. ఇక, జన సమీకరణ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఈ లెక్కన అభ్యర్థుల వ్యయం శ్రీ క్రోధి నామ సంవత్సరంలో రూ.కోట్లలో ఉండనుందని సమాచారం. దీనికి ప్రతిఫలంగా ప్రజలు ఓట్ల రూపంలో ఆదాయం ఇవ్వనున్నారు. ఇది ఎవరికి అధికంగా ఉంటే వారినే రాజయోగం వరించనుంది. ఈ నేపథ్యంలో ఎంపీ అభ్యర్థులు ఇప్పటికే తమ జాతకాలను పరీక్షించుకుంటున్నారు. ఎవరి ఆదాయ, వ్యయాలు ఎంత? ఎవరి రాజపూజ్యం ఎంత? ఎవరికి రాజయోగం ఉంది? తదితర వివరాలను పండితులను అడిగి తెలుసుకుంటున్నారు.



'క్రోధి' వచ్చే.. ఆనందం తెచ్చే..

తెలుగువారి పండుగ ఉగాది రానే వచ్చేసింది. తెలుగు వాకిల్లలో క్రోధి నామ సంవత్సరం సందడి మొదలైంది. ఉగాది అంటే ప్రతీ ఒక్కరికి గుర్తుకొచ్చేది పచ్చడి. షడ్రుచుల సమ్మేళనమే పండుగ ప్రత్యేకత. జీవితంలో వచ్చే కష్టసుఖాలను అందరూ అనుభవించాలని గుర్తుచేసేదే పచ్చడి. హిందూ పురాణాల ప్రకారం, ఉగాదిలో 'ఉగ' అంటే నక్షత్ర గమనం.. ఈ గమనానికి ఆది ఉగాది.. అంటే సృష్టి ఉగాది రోజు నుంచే ప్రారంభమైందని అర్థం. చైత్రమాసం శుక్లపక్షంలో సూర్యోదయ వేళకు పాడ్యమి తిథి రోజును ఉగాదిగా నిర్ణయిస్తారు. ఈ పండుగను తెలుగువారే కాకుండా మరాఠీలు 'గుడిపడ్వా'గా, తమిళులు 'పుత్తాండు', మలయాళీలు 'విషు', సిక్కులు 'వైశాఖీ', బెంగాలీలు 'పోయ్ లా బైశాఖ్'గా జరుపుకుంటారు. ఈ సమయంలో ప్రముఖ ఆలయాల్లో పండితులు పంచాంగ శ్రవణం పఠిస్తారు. ఈ నేపథ్యంలో క్రోధి నామ సంవత్సరంలోకి అడుగు పెట్టబోతున్నాం.

హనుమాన్ చిన్న జయంతికి ఏర్పాట్లు

- భక్తులకు ఇబ్బందులు రానీయొద్దు
- కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: కొండగట్టులో ఈనెల 21నుంచి జరిగే చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలని, భక్తులకు ఇబ్బంది రానీయొద్దని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. ఉత్సవాల నిర్వహణపై కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. వాహనాలకు ఏడు పార్కింగ్ స్థలాలు, ప్రతి పార్కింగ్ చోటా తాగునీరు, శానిటేషన్ చేపట్టాలని ఆదేశించారు. లడ్డూ, పులిహోర, ప్రసాదం విక్రయాలకు 14 కౌంటర్లు, కేశఖండనం, ప్రత్యేక దర్శనం టికెట్లకు 12కౌంటర్లు ఏర్పాటు చేశామని, అన్ని కౌంటర్లలో మూడు షిఫ్టుల్లో సిబ్బంది ఉంటారని, మాల విరమణకూ అర్చకులను మూడు షిఫ్టులుగా నియమించామని తెలిపారు. కొత్త కోనేరులోకి నీటిని ఎప్పటికప్పుడు సరఫరా చేసి శుభ్రం చేయాలని ఆదేశించారు. 120 షవర్‌బాత్‌లు, మహిళలు, పురుషులకు ప్రత్యేక డ్రెస్సింగ్ రూమ్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. కేశఖండనానికి 1500 మంది నాయీబ్రాహ్మణులు అందుబాటులో ఉంటారని, భక్తులు క్యూ పద్ధతి పాటించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. 76 శాశ్వత మరుగుదొడ్లు, 58తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. దీక్ష తీసుకున్న స్వాములు కూర్చునేందుకు ప్రత్యేక పందిళ్లు, బారికేడ్స్ నిర్మిస్తామని, ఆలయ ప్రాంగణం, రోడ్లు, చుట్టుపక్కల పారిశుధ్య పనులు నిరంతరం చేపట్టాలని ఆదేశించారు. వేసవికాలం దృష్ట్యా అవసరమైన మందులు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఆలయం తరఫున పార్కింగ్ స్థలాల నుంచి ఆలయం వరకు భక్తుల సౌకర్యార్థం రెండు బస్సులు నడిపిస్తామన్నారు. పకడ్బందీ బందోబస్తు చేపట్టాలని పోలీసుశాఖ, విద్యుత్ సరఫరాలో అవాంతరాలు లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ నీరు కొండపైకి వచ్చేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. రెండు అంబులెన్స్‌లు అందుబాటులో ఉండాలన్నారు. కరీంనగర్, వేములవాడ, వరంగల్, మంచిర్యాల, సిరిసిల్ల, హుజూరాబాద్, కోరుట్ల, మెట్‌పల్లి డిపోల నుంచి కొండగట్టుకు బస్సు సర్వీసులు నడిపించాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. ఎంపీ ఎన్నికల నియామవళికి లోబడి అధికారులు విధులు నిర్వర్తించాలని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర, అదనపు ఎస్పీ వినోద్, డీఎస్పీ రఘుచందర్, కొండగట్టు ఆలయ ఈవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

లీకేజీలు.. మరమ్మతులు

- తాగునీటికి ప్రజల తీవ్ర ఇబ్బంది
- కోరుట్ల బల్దియాలో రోజు విడిచి రోజు సరఫరా
- పరిస్థితి మారకుంటే రెండు నెలలు గండమే
- మిషన్ భగీరథ పథకంతో పరేషాన్

కోరుట్ల: అసలే రోజు విడిచి రోజు నీరు సరఫరా అవుతున్న పరిస్థితి.. ఆపై లీకేజీలతో కోరుట్ల మున్సిపాల్టీలో మిషన్ భగీరథ నీటికోసం తిప్పలు తప్పడం లేదు. ఇబ్రహీంపట్నం మండలం డబ్బా గ్రామంలోని మిషన్ భగీరథ ప్లాంట్‌లో తరచూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీనికితోడు పట్టణంలోని పలుచోట్ల వాల్వ్‌లు లీకేజీ కావడంతో నీటి సరాఫరాలో అంతరాయం కలుగుతోంది.

నడిబొడ్డున పరేషాన్..
పట్టణంలోని నడిబొడ్డున నీటికోసం జనం తిప్పలు పడుతున్నారు. ప్రతి వేసవిలోనూ గాంధీరోడ్, వినోబారోడ్, శివాజీరోడ్, టీచర్స్ క్లబ్ రోడ్ ఏరియాల్లో నీటికోసం జనం అవస్థలు పడేవారు. ఆరేళ్ల క్రితం ఆయా ప్రాంతాల్లో ప్రతిరోజూ ట్యాంకర్లతో నీటి సరఫరా జరిగేది. డబ్బా గ్రామంలోని మిషన్ భగీరథ ప్లాంట్ ఏర్పాటు తరువాత ఆ తిప్పలు తొలగిపోయాయి. ఇంటింటికీ నల్లా కనెక్షన్లు ఇవ్వడం.. నీటి సరఫరా మెరుగుపడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు. ఈ మధ్యకాలంలో తరచూ డబ్బా నుంచి వాటర్ ప్లాంట్‌కు నీటి సరఫరా తగ్గిపోవడంతో రోజువిడిచి రోజు నీరు సరఫరా చేస్తున్నారు.

లీకేజీల తిప్పలు
వేసవిలో ఇళ్లల్లో బోర్లు అడుగంటిపోవడంతో సాధారణ వాడకానికి, తాగునీటి కోసం మిషన్ భగీరథ నీటిపైనే జనం ఆధారపడుతున్నారు. ఈ క్రమంలో మిషన్ భగీరథ నీరు రోజు విడిచి రోజు మూడు నుంచి ఐదు గంటల పాటు సరఫరా చేస్తున్నారు. డబ్బా ప్లాంట్ దగ్గర తరచూ మరమ్మతులు రావడంతో నీటి సరఫరాలో లోపాలు చోటు చేసుకుంటున్నాయి. దీనికితోడు పట్టణంలోని తిలక్‌రోడ్, గోదాం రోడ్, కాలేజీ గ్రౌండ్ మైదానం, ఐబీ రోడ్, శివాజీ రోడ్, కాగజ్‌పురా తదితర ప్రాంతాల్లో ఉన్న వాల్వ్‌ల నుంచి నీరు లీకేజీ అవుతోంది. అక్కడక్కడ మిషన్ భగీరథ పైప్‌లు పగిలి నీరు లీకేజీ కావడంతో చివరి ఇళ్లకు నీరు సరఫరా కావడం లేదు.

తాగునీరు వృథా
ధర్మపురి: అసలే ఎండలు మండిపోతున్నాయి. గుక్కెడు తాగునీటికి కరువయ్యే పరిస్థితులున్నాయి. ధర్మపురి బల్దియాలో అధికారులు ఆన్‌ఆఫ్ బిగించలేక తాగునీరు వృథా అవుతోంది. పట్టణంలోని తెనుగువాడ గద్దెకు సమీపంలో.. నర్సయ్యపల్లె రూట్‌లో కొన్ని నల్లాలకు ఆన్‌ఆఫ్‌లు లేవు. దీంతో నిత్యం నీరంతా వృథాగా పోతోంది. మున్సిపల్ అధికారులకు పలు మార్లు తెలిపినా ఆన్‌ఆఫ్ బిగింపులో నిర్లక్ష్యం చూపారనే ఆరోపణలున్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల వెనుక నుంచి నీళ్లట్యాంకు కింద నీటి ఓవర్‌ఫ్లోతో ట్యాంకు కింద నీరు చేరి చెరువును తలపిస్తోంది. ఆ ప్రాంతంలో ఈగలు, దోమలు చేరి దుర్గంధం వెదజల్లుతోంది. పట్టణంలోని ప్రతి నల్లాకు ఆన్ ఆఫ్‌లు బిగిస్తే తాగునీటి సమస్య కొంత వరకైనా తీరే పరిస్థితులున్నాయి.



కోరుట్లలోని గోదాం రోడ్‌లో వాల్వ్ లీకేజీ



కోరుట్ల గడి బురుజుల సమీపంలో మరమ్మతు



ధర్మపురిలో నీళ్లట్యాంకు కింద నిలిచిన నీరు

ఎప్పటిప్పుడు మరమ్మతులు

కోరుట్ల మున్సిపాల్టీలో అక్కడక్కడ వాల్వ్‌లు లీకేజీ అవుతున్నాయి. వాటిని ఎప్పటికప్పుడు మరమ్మతు చేసి నీటి సరాఫరాలో అంతరాయం లేకుండా చూస్తున్నాం. వేసవిలో పట్టణ అవసరాల అనుగుణంగా ప్రజలకు ఇబ్బంది లేకుండా నీటి సరఫరా చేస్తాం.

– అభినయ్, డీఈ, కోరుట్ల మున్సిపల్

ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ

జగిత్యాలటౌన్: ఎంపీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అధికారులు అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై జిల్లానుంచి పలువురు బాధితులు తమ సమస్యలను అధికారులకు విన్నవించారు.



అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

కౌలుకిస్తే.. కాజేశారు



వల్లంపల్లి శివారులోని సర్వే నంబర్ 39/4లోగల ఎనిమిదెకరాల భూమి మా పూర్వీకుల నుంచి వారసత్వంగా సంక్రమించింది. ఆ భూమిలో నలుగురు అన్నదమ్ములకు తలా రెండెకరాలు వచ్చింది. మా గ్రామానికే చెందిన బందరికంటి లక్ష్మి భర్త బుచ్చయ్య, ధనిశెట్టి గంగన్న, సందెల రాజన్న, బొడ్డు మల్లమ్మ భర్త భూమయ్య కౌలుకు తీసుకుని కాస్తు చేశారు. మాకు తెలియకుండానే వారి పేర్లపై మార్పిడి చేసుకున్నారు. ప్రశ్నిస్తే దిక్కున్నచోట చెప్పుకోండని బెదిరిస్తున్నారు. విషయాన్ని మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. అక్రమ భూమార్పిడిని రద్దు చేసి మా భూమిని మాకు ఇప్పించాలి.

– సంపతి చంద్రవ్వ, సంపతి లక్ష్మి

క్లుప్తంగా

'ఉపాధి' కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

కరీంనగర్: ఉపాధిహామీ పని ప్రదేశాల్లో కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్ డిమాండ్ చేశారు. డీఆర్‌డీవో శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని, పని ప్రదేశాల్లో మంచినీరు, నీడ సౌకర్యం కల్పించడంతోపాటు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలన్నారు. కొన్ని గ్రామాల్లో మధ్యాహ్నం 12 గంటల వరకు పనులు చేయిస్తున్నారని, ఫొటో అప్‌లోడ్ చేసిన తర్వాతే కూలీలు ఇంటికి వెళ్లే పరిస్థితి నెలకొందన్నారు. కొలతలు లేకుండా పనులు కల్పించి, కూలీలను ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బోయిని అశోక్, జిల్లా నాయకుడు ఎగుర్ల మల్లేశం తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

హుజూరాబాద్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరొకరికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. ఎలకతుర్తి మండలంలోని పెంచికలపేట గ్రామంలో ఆర్‌ఎంపీగా పని చేస్తున్న ఇప్పలపల్లి రవీందర్(42) సోమవారం పని నిమిత్తం బైక్‌పై జమ్మికుంట వెళ్తున్నాడు. శాలపల్లి శివారులోని పెట్రోల్ బంక్ నుంచి అంజన్‌కుమార్ ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. హుజూరాబాద్–జమ్మికుంట ప్రధాన రహదారిపై యూటర్న్ వద్ద వీరి వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఘటనలో రవీందర్ అక్కడికక్కడే మృతి చెందగా అంజన్‌కుమార్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని జమ్మికుంట ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య రేణుక, ఇద్దరు కుమారులు ఉన్నారు. తండ్రి మొగిళి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


రామగుండంలో నోటికి శూలం గుచ్చుకుంటున్న భక్తురాలు


శూలాలు, ఘటాలు ధరించి, స్వాముల ఊరేగింపు

ఒంటినిండా శూలాలు.. గగుర్పొడిచే విన్యాసాలు

బర్మా కాందీశీకుల ఆరాధ్య దైవం నూకాంబిక పోచమ్మ జాతర సోమవారం అగ్నిగుండ ప్రవేశంతో ముగిసింది. 15రోజులుగా నిత్యపూజలతో నూకాంబిక పోచమ్మతల్లికి విశేష పూజలు చేసిన భక్తులు.. చివరిరోజు నాలుక, శరీరానికి శూలాలు గుచ్చుకుని విన్యాసాలు ప్రదర్శించారు. విదేశాలతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి బర్మాకాందీశీకుల కుటుంబాలు హాజరై నూకాంబిక పోచమ్మతల్లి దీవెనలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు, ఎమ్మెల్యే మక్కాన్ సింగ్–మనాలిఠాకూర్ దంపతులకు ఉత్సవ కమిటీ చైర్మన్ జమ్ముల రామారావు నూకాంబిక చిత్రపటాన్ని అందజేశారు.

– రామగుండం/సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి


నూకాంబిక అమ్మవారి ఊరేగింపులో భక్తులు


అగ్నిగుండంలో నడుస్తున్న భక్తుడు


రామగుండం ఎమ్మెల్యే సతీమణికి నూకాంబిక చిత్రపటం బహూకరణ

సౌదీలో దమ్మన్నపేట వాసి మృతి

- ఈ నెల 3న గుండెపోటు
- కన్నీరుమున్నీరవుతున్న కుటుంబసభ్యులు

మేడిపల్లి(జగిత్యాల): అప్పులు తీర్చేందుకు సౌదీ వెళ్లిన మేడిపల్లి మండలంలోని దమ్మన్నపేటకు చెందిన నిమ్మ రాజశేఖర్ అక్కడే గుండెపోటుతో మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. రాజశేఖర్ 15 ఏళ్లుగా గల్ఫ్ వెళ్తున్నాడు. కొన్నేళ్లు దుబాయి వెళ్లగా పని లేకపోవడంతో స్వగ్రామం తిరిగి వచ్చాడు. ఎనిమిదేళ్లుగా సౌదీ వెళ్తూ అక్కడ డ్రైవర్‌గా పని చేస్తు న్నాడు. ఈ నెల 3న తన రూంలో గుండెనొప్పితో కుప్పకూలాడు. ఆస్పత్రికి తరలించగా మృతిచెందినట్లు వైద్యులు చెప్పారని రాజశేఖర్ రూమ్‌మేట్స్ అతని భార్య మాధవికి ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. ఈ విషయం తెలిసినప్పటి నుంచి మృతుడి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తన భర్త మృతదేహాన్ని త్వరగా ఇంటికి రప్పించాలని మాధవి వేడుకుంటోంది. మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. రాజశేఖర్‌ది నిరుపేద కుటుంబమని, దాతలు ఆదుకోవాలని గ్రామస్తులు, సహాయం చేయాలనుకునేవారు 98483 83383 నంబర్‌కు ఫోన్‌పే చేయాలని బంధువులు కోరుతున్నారు. సౌదీ జేఏసీ ఇన్‌చార్జి తేలు నరేశ్ తదితరులు రాజశేఖర్ మృతదేహాన్ని స్వగ్రామం పంపించేందుకు కృషి చేస్తున్నట్లు జేఏసీ నాయకులు గుగ్గిల్ల రవిగౌడ్, సింగిరెడ్డి నరేశ్ రెడ్డి తెలిపారు.

రాజన్న ధర్మగుండంలోకి 'గోదారి'

వేములవాడ: వేములవాడ రాజన్న భక్తుల పుష్కరిణిగా పేరొందిన ధర్మగుండంలోని అపరిశుభ్రమైన నీటిని ఆలయ అధికారులు తొలగించారు. మిడ్‌మానేరు నుంచి నేరుగా గోదావరి జలాలను నింపారు. దీంతో సోమవారం స్వచ్ఛమైన నీటిలో భక్తులు పుణ్యస్నానం చేశారు. కొన్ని తరగతుల విద్యార్థులకు పరీక్షలు ముగిసి, వేసవి సెలవులు ప్రారంభమవడంతో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు నిత్యం స్వామివారిని దర్శించుకునేందుకు వస్తున్నారు. వారికి భద్రత కల్పించేందుకు జిల్లా పోలీసులు డాగ్‌స్క్వాడ్‌తో ఆలయ పరిసర ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. మండుతున్న ఎండలకు గొంతులు ఎండిపోయి భక్తులు డీహైడ్రేషన్‌కు గురవుతున్నారు. దీంతో ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన 6 రాజన్న జలప్రసాదాల కేంద్రాలు దాహార్తిని తీరుస్తున్నాయి.

ఎల్లారెడ్డిపేటలో రెండిళ్లపై దాడులు

- భూ డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రంలోని రెండిళ్లపై స్థానిక పోలీసులు టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి సోమవారం దాడులు నిర్వహించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు సోదాలు జరిపామని సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్సై రమాకాంత్ తెలిపారు. భూములకు సంబంధించిన డాక్యుమెంట్లు, ప్రామిసరీ నోట్లు స్వాధీనం చేసుకున్నారు. రెండు రోజుల క్రితం మండలంలో వడ్డీ వ్యాపారం నిర్వహించేవారి ఇళ్లలో తనిఖీలు చేసి, భారీగా నగదు, అప్పులకు సంబంధించిన ప్రామిసరీ నోట్లను పోలీసులు పట్టుకున్నారు. వరుస ఘటనలతో వడ్డీ వ్యాపారులు ఆందోళనకు గురవుతున్నారు. ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకొని, విచారిస్తున్నట్లు తెలిసింది. ఎంతకాలం నుంచి అధిక వడ్డీకి అప్పులిస్తున్నారు.. ఎంతెంత.. ఎంత మందికి ఇచ్చారన్న వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. అయితే, ఇందుకు సంబంధించిన వివరాలను పోలీసులు అధికారికంగా వెల్లడించలేదు. దాడులు చేసినట్లు సీఐ శ్రీనివాస్‌గౌడ్ ధ్రువీకరించారు. విచారణ జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్ ధర్నాలు సిగ్గుచేటు



మల్లాపూర్: రైతు సమస్యలంటూ బీఆర్‌ఎస్ నాయకులు ధర్నాలు చేయడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. కిసాన్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డిని స్థానిక పార్టీ కార్యాలయంలో సన్మానించారు. బీఆర్‌ఎస్ రైతుల శ్రేయస్సు కోరితే షుగర్ ఫ్యాక్టరీని ఎందుకు పునఃప్రారంభించలేదని ప్రశ్నించారు. కోరుట్ల నియోజకవర్గంలో నీళ్లు లేక ఎండిపోయిన పంటలను ఎమ్మెల్యే సంజయ్ చూపించాలని సవాల్ చేశారు. ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. జలపతిరెడ్డి మాట్లాడుతూ.. మూడు నెలల కాంగ్రెస్ ప్రభుత్వంపై విపక్షాలు చేస్తున్న ఆరోపణలను ఖండించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు, ఏలేటి మహిపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పోతు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'పారమిత'లో ముందస్తు ఉగాది వేడుకలు


ఉగాది పచ్చడి తీసుకుంటున్న విద్యార్థినులు

కొత్తపల్లి(కరీంనగర్): పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో ముందస్తు క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉగాది పచ్చడిని తయారు చేసి, దాని విశిష్టతను తెలిపారు. అనంతరం పంచాంగ శ్రవణ కార్యక్రమం జరిపారు. విద్యార్థులు సాంప్రదాయ నృత్యాలు, పాటలతో అలరించారు. విద్యాసంస్థల చైర్మన్ ఇ.ప్రసాదరావు, డైరెక్టర్లు రశ్మిత, అనూకర్‌రావు, ప్రసూన, వినోద్ రావు, వి.యు.ఎం.ప్రసాద్, ప్రిన్సిపాల్ రితేశ్ మెహతా, ప్రోగ్రాం హెడ్ గోపికృష్ణ, సమన్వయకర్తలు రబీంద్ర పాత్రో, సరిత, రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జల్సాలకు అలవాటుపడి చోరీలు..

- దొంగ అరెస్టు
- 20 విద్యుత్ మోటార్లు, ద్విచక్రవాహనం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏసీపీ కృష్ణ


పోలీసులకు రివార్డు ఇస్తున్న ఏసీపీ కృష్ణ

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): జల్సాలకు అలవాటు పడి చోరీలు చేస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఏసీపీ కృష్ణ తెలిపారు. సోమవారం సుల్తానాబాద్ సర్కిల్ కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. కాల్వశ్రీరాంపూర్ మండలంలోని మీర్జంపేట(కొత్తపల్లి)కు చెందిన గోపు సంపత్ తాపీ మేస్త్రి, వ్యవసాయ పనులు చేసేవాడు. ఇలా వచ్చిన డబ్బులు తన జల్సాలకు సరిపోకపోవడంతో దొంగతనాలు చేయాలనుకున్నాడు. 2006 నుంచి గేదెలు, బంగారం ఇతర చోరీలకు పాల్పడగా పాత్కపల్లి, వీణవంక, కాల్వశ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం 2 నెలలుగా సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్, పొత్కపల్లి మండలాల పరిధిలో రైతులు మానేరు వాగు, ఎస్సారెస్పీ కెనాల్లో ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటార్లను ఎత్తుకెళ్తున్నాడు. వాటిని తన ఇంటి వద్ద దాచిపెట్టి, డబ్బు అవసరం ఉన్నప్పుడు విక్రయించేవాడు. ఈ క్రమంలో పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధి గుంపుల బ్రిడ్జి సమీపంలో పోలీసులు ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో ద్విచక్రవాహనంపై వస్తున్న సంపత్ అనుమానాస్పదంగా కనిపించాడు. పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకున్నారు. విచారణలో తాను చోరీ చేసిన మోటార్‌ను హనుమకొండలో విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు, ఇదివరకు 20 మోటార్లను దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. పోలీసులు మోటార్లు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. దొంగను పట్టుకున్న సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై అశోక్‌రెడ్డి, ఏఎస్సైలు తిరుపతి, రత్నాకర్, హెడ్‌కానిస్టేబుల్ రాజేందర్, కానిస్టేబుల్ తిరుపతినాయక్‌లను అభినందించి, రివార్డు అందించారు.

29 ఏళ్లకు పోలీసులకు చిక్కాడు

- తప్పించుకు తిరిగిన చోరీ కేసు నిందితుడు
- అరెస్టు చేసిన సీఐడీ టీం


చందు

జగిత్యాల క్రైం: చోరీ కేసులో నిందితుడిగా ఉన్న ఓ వ్యక్తి కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకు తిరిగాడు. 29 ఏళ్లకు పోలీసులకు చిక్కాడు. సీఐడీ అడిషనల్ డీజీపీ షిఖా గోయల్ సోమవారం సంబంధిత వివరాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారు. జగిత్యాల రూరల్ మండలం పెర్కపల్లి శివారులోని ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన ముఠాపై 06.01.1995న జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. తర్వాత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కరీంనగర్ సీఐడీకి బదిలీ చేశారు. ఈ కేసులో ఏ–27 నిందితుడిగా ఉన్న నిర్మల్ జిల్లా ఖానాపూర్‌కు చెందిన నర్ర చందు అలియాస్ చంద్రయ్య కోర్టుకు హాజరు కాకపోవడంతో నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ అయ్యింది. అప్పటినుంచి సీఐడీ పోలీసులు అతని కోసం వెతుకుతున్నా జాడ తెలియలేదు. ఎట్టకేలకు సీఐడీ అడిషనల్ డీజీపీ షిఖా గోయల్ ఆధ్వర్యంలో ఎస్పీ బి.రాంరెడ్డి, ఎస్పీడబ్ల్యూఎస్ టీం సభ్యులు నరేశ్, యూనస్‌ఖాన్, రతన్‌జీ రావ్, హన్మంతరావు ఆదివారం నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో చంద్రయ్యను అరెస్టు చేశారు. అతన్ని కరీంనగర్ ఫస్ట్ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చినట్లు పోలీసులు పేర్కొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు

- ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలి
- జగిత్యాల మున్సిపల్ కమిషనర్ అనిల్‌బాబు


అనిల్‌బాబు

జగిత్యాల: వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడుతున్నందున తాగునీటి సమస్య రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని, ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని మున్సిపల్ కమిషనర్ అనిల్‌బాబు తెలిపారు. సోమవారం అధికారులతో సమావేశమయ్యారు. పైప్‌లైన్ లీకేజీలు ఉంటే చెక్ చేయాలని, ప్రతి ఇంటినీ సర్వే చేసేలా వార్డు అధికారులను నియమించామని పేర్కొన్నారు. పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తూ డెంగీ, మలేరియా జ్వరాలు ప్రబలకుండా.. ఇంటి యజమానులు పరిశుభ్రత పాటించేలా సూచనలు జారీ చేశారు. కొత్తగా ఇళ్ల నిర్మాణం చేస్తున్నవారు తప్పనిసరిగా ఇంకుడు గుంతలు తవ్వుకోవాలని, జియో ట్యాగింగ్ చేసుకుంటేనే ఇంటికి నంబరు ఇస్తామని తెలిపారు. స్పెషల్ ఆఫీసర్ నరేశ్, డెప్యూటీ ఈఈ యాదగిరి, ఏఈలు చరణ్ పాల్గొన్నారు.

కూతురు ప్రేమ పెళ్లిపై కన్నీటి నిరసన

- ఆమె చనిపోయిందంటూ ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన తల్లిదండ్రులు
- సోషల్ మీడియాలో వైరల్


ఫ్లెక్సీ వద్ద కన్నీరు పెడుతున్న నిర్మల–మురళీకృష్ణ

సిరిసిల్ల: అల్లారుముద్దుగా పెంచుకున్న కూతురు ఇంటి నుంచి వెళ్లిపోయి, ప్రేమ పెళ్లి చేసుకుందని ఓ తండ్రి కన్నీరు పెట్టుకున్నాడు. ఆమె చనిపోయిందంటూ ఫ్లెక్సీ ఏర్పాటు చేసి నిరసన తెలిపిన ఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సిరిసిల్ల పట్టణంలోని బీవై.నగర్‌కు చెందిన చిలువేరి మురళీకృష్ణ, నిర్మల దంపతులకు ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. కూతురు అనూష హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతోంది. వారం రోజుల కిందటే కాలేజీ నుంచి ఇంటికి వచ్చిన ఆమె స్థానికంగా ఉండే లింగం హరికుమార్‌ను ఆదివారం ప్రేమ వివాహం చేసుకుంది. అనూష తీసుకున్న ఈ నిర్ణయంతో తల్లిదండ్రులు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. సోమవారం తమ ఇంటి ఎదుట అశ్రునివాళి అంటూ.. కూతురు ఫొటోతో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. 'అమ్మలారా.. అయ్యలారా.. మాలాంటి కష్టం ఎవరికీ రావొద్దు.. కూతురును ఎంతో ప్రేమతో పెంచి, చదివిస్తే.. ఆమెను మోసం చేసి, ట్రాప్ చేసి ఇంటి నుంచి తీసుకెళ్లారంటూ..' విలపించారు. ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

హెడ్‌కానిస్టేబుల్ సస్పెన్షన్

మల్లాపూర్(కోరుట్ల): జగిత్యాల జిల్లా మల్లాపూర్ పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ అశోక్‌ను సస్పెండ్ చేస్తూ మల్టీజోన్–1 ఐజీ రంగనాథ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఠాణాకు మద్యం తెచ్చుకున్న హెడ్ కానిస్టేబుల్ అశోక్, కానిస్టేబుళ్లు ధనుంజయ్, సురేశ్, ఇద్దరు బయటి వ్యక్తులతో కలిసి విందు చేసుకున్న ఘటనలో ఇప్పటికే కానిస్టేబుళ్లపై ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ చర్యలు తీసుకున్నారు. ఈ సంఘటన జిల్లాలో చర్చనీయాంశమైంది.

తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించిన వ్యక్తిపై కేసు

జమ్మికుంట(హుజూరాబాద్): తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి, ఇంటి స్థలం కాజేయాలని చూసిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు జమ్మికుంట టౌన్ సీఐ రవి తెలిపారు. పట్టణానికి చెందిన పచ్చిమట్ల శ్రీనివాస్ ఇంటి స్థలాన్ని ఆక్రమించుకునేందుకు అకినపల్లి మురళీధర్ తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించాడు. తర్వాత కోర్టులో కేసు వేశాడు. శ్రీనివాస్ ఆర్టీఐ కింద దరఖాస్తు చేయగా రెవెన్యూ ఆఫీస్ నుంచి సమాచారం రాలేదు. నకిలీ పత్రాలు సృష్టించి, అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసినట్లు తెలిసిందని, మురళీధర్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.